## క్లుప్తంగా

### ఉగాది పురస్కారానికి రంగనాథం ఎంపిక



రాజాం సిటీ: ఉగాది పురస్కారానికి రాజాం రచయితల వేదిక నిర్వాహకులు గార రంగనాథం ఎంపికయ్యారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం జరగనున్న పురస్కారాల ప్రదానోత్సవానికి హాజరై, అవార్డు తీసుకోవాలని నిర్వాహకుల నుంచి సమాచారం అందిందని రంగనాథం శనివారం తెలిపారు. ఆయనకు అవార్డు రావడం పట్ల రారవే సభ్యులు, భాషాభిమానులు, పట్టణవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ

రాజాం: ఉగాది పురస్కరించుకుని, బొద్దాంకు చెందిన త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు రూపొందించిన క్యాలెండర్‌ను స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జె.రామప్పలనాయుడు చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించారు. శ్రీవిశ్వావసు నామ సంవత్సరంలో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించేలా భగవంతుడు ఆశీర్వదించాలని వారు ఆకాంక్షించారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన తెలుగు కాలసూచికలోని ఎన్నో భగవద్గీత వచనాలతో ఈ క్యాలెండర్ తయారు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎం.రామినాయుడు, రామకృష్ణ, సూరపునాయుడు, లక్ష్మి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

### ఫ్యాప్టో జిల్లా కో-చైర్మన్‌గా సూర్యనారాయణ



తెర్లాం: ఫ్యాప్టో జిల్లా కో-చైర్మన్‌గా పెరుమాళి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు గుడివాడ సూర్యనారాయణను నియమించారు. ఈ మేరకు ఆ సంఘం నుంచి శనివారం ఓ ప్రకటన జారీ అయింది. బీటీఏ(బహుజన్ టీచర్స్ అసోసియేషన్)జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్న సూర్యనారాయణను ఫ్యాప్టో జిల్లా కో-జిల్లా చైర్మన్‌గా కూడా ఎంపిక చేయడం విశేషం. ఆయన ఎంపిక పట్ల పలువురు ఉపాధ్యాయులు, ఫ్యాప్టో నాయకులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### సజావుగా బీసీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలు

తెర్లాం/బాడంగి/బొబ్బిలిరూరల్/వంగర/రేగిడి: అన్ని మండల పరిషత్ కార్యాలయాల్లో బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి శనివారం చేసిన ఇంటర్వ్యూలు సజావుగా జరిగాయి. తెర్లాం మండలం నుంచి 660 మంది, బొబ్బిలి మండలంలోని వివిధ గ్రామాల నుంచి 610 మంది, బాడంగి మండలం నుంచి 365 మంది, వంగర మండలం నుంచి 142 మంది, రేగిడి మండలం నుంచి 195 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. అధికారులు వారి ధ్రువపత్రాలను పరిశీలించి, అర్హులను నిర్ధారించారు.

### అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలి

రేగిడి: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు సూచించారు. మండలంలోని బూరాడ, సోమరాజుపేట, లక్ష్మీపురం, ఖండ్యాం తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో లెర్నింగ్ అచీవ్‌మెంట్ సర్వే శనివారం చేపట్టారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యేలా బోధనకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన అన్నారు. అలాగే ఉపాధ్యాయులంతా చదువులో వెనకబడిన విద్యార్థి విద్యాప్రగతికి కృషి చేయాలని తెలిపారు.

### సోషల్ ఆడిట్‌పై ప్రజావేదిక

సంతకవిటి: స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి జరిగిన సోషల్ ఆడిట్(సామాజిక తనిఖీలు)పై ప్రజావేదిక కార్యక్రమం శనివారం నిర్వహించారు. విజయనగరం ఏపీడీ వై.పద్మజ, రాజాం ఏపీడీ ఎం.శ్రీనివాస్, ఎస్ఆర్‌పీ బి.మన్మధరావుల ఆధ్వర్యంలో డీఆర్‌పీలు ఆడిట్‌లో వెలుగు చూసిన అక్రమాలను బయటపెట్టారు. చాలా గ్రామాల్లో వేతనదారుని వేలిముద్ర, సంతకం లేకుండానే పేమెంట్ చేశారని, సురవరంలోని మొగిలి చెరువులో బెంచ్ మార్క్ ఫొటోస్ లేకుండానే రూ.1,35,901 పేమెంట్ చేశారని, మండాకురిటిలో గతేడాది 108 మంది వేతనదారులకు 458 పనిదినాలకు గాను రూ1.12 లక్షలు బకాయిపడినట్లు గుర్తించామన్నారు. కార్యక్రమంలో ఏపీవో ఆర్.హరనాధరావు, ఎంపీడీవో కె.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### కుట్టుమిషన్ల పంపిణీ

రాజాం సిటీ: అనాథలను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన దాతల ఔదార్యం చాలా గొప్పదని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు ప్రశంసించారు. నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్ సభ్యులు గంధం సతీష్, ప్రసాద్‌లు సమకూర్చిన కుట్టుమిషన్లను పది మంది అనాథలకు శనివారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ ప్రాంతానికి తమవంతు సహాయం చేయాలన్న ఆలోచనతో ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇద్దరు పేద విద్యార్థులకు ట్యాబ్‌లతో పాటు కొండంపేటలోని అనాథ ఆశ్రమానికి నిత్యవసర సరుకులు, సారథి రోడ్డులోని చెవిటి మూగ పాఠశాలలో సౌకర్యాలు కల్పించేందుకు దాతలు సహకరిస్తుండడం మెచ్చుకోదగ్గదన్నారు. కార్యక్రమంలో రాజాం టౌన్, రూరల్ సీఐలు కె.అశోక్‌కుమార్, హెచ్.ఉపేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

- అస్తవ్యస్తంగా గ్రామీణ రోడ్లు
- దారి పొడవునా గుంతలు, తేలినరాళ్లు
- ప్రమాదాల బారినపడుతున్న ప్రజలు
- కానరాని పీఎంజీఎస్‌వై పథకం
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం

# అధ్వానంగా రోడ్లు.. జనం అవస్థలు!



అధ్వానంగా పానుగుటివలస-తలతంపర గ్రామాల రోడ్డు

రాజాం: గ్రామీణ ప్రాంతాల రోడ్లు మరీ దారుణంగా తయారయ్యాయి. ఏ రోడ్డు చూసినా దారి పొడవునా గుంతలు, పైకి తేలినరాళ్లతో కనిపిస్తున్నాయి. ఇలాంటి అధ్వానమైన రహదారుల్లో ప్రయాణించాలంటే నరకయాతన పడుతున్నామని అటు వాహనదారులు ఇటు పాదచారులు వాపోతున్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అవసరమైన పలుచోట్ల రాష్ట్ర నిధులతో లింకు రోడ్లు బాగుచేయించింది. ప్రస్తుతం అధికారంలోని కూటమి ప్రభుత్వం రోడ్లు బాగోగులు పట్టించుకోవడం లేదు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నా ఇప్పటివరకు పీఎంజీఎస్‌వై(ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన) పథకం కింద రోడ్లు బాగు చేయడానికి నిధులు కూడా తెప్పించుకోలేకపోయింది. తాము అధికారంలోకి వస్తే రోడ్లు అద్దాల్లా మెరుస్తాయని ఆ దిశగా చర్యలు తీసుకుంటామని పలికిన ప్రగల్భాలు ఇప్పుడు ఏమయ్యాయని జనం ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రోడ్లు బాగు చేయాలని కోరుతున్నారు.

**• రాజాంలో పక్కారోడ్లు ఏవీ?**

రాజాం మండలంలో మొత్తం 21 పంచాయతీలు ఉండగా, ఏ పంచాయతీకి ఆయా పంచాయతీ పరిధిలోని మిగిలిన గ్రామాలకు పక్కారోడ్ల నిర్మాణం జరగలేదు. గతంలో ఎన్ఆర్ఈజీఎస్, పంచాయతీరాజ్ నిధులతో పాటు రాష్ట్ర ఆర్థికశాఖ మంజూరు చేసిన నిధులతో రోడ్లు వేసేవారు. ప్రస్తుతం వాటి నిర్మాణం లేకపోవడంతో పలు గ్రామాల రోడ్లు ఇప్పుడు అధ్వానంగా మారాయి. ముఖ్యంగా దోసరి-ఆగూరు, గడిముడిదాం-సీఎస్ఆర్‌పురం, బొద్దాం-సోపేరు, బొద్దాం-కొఠారిపు తదితర గ్రామాల మధ్య రోడ్లు కనుమరుగైన పరిస్థితి నెలకొంది.



రాళ్లుతేలిన గడిముడిదాం-సీఎస్ఆర్ పురం రోడ్డు

**• రేగిడిలోని రోడ్లు.. తారురోడ్లు అయ్యేదెప్పుడో?**

రేగిడి మండలంలోని పలు గ్రామాల లింకురోడ్లు అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లింకురోడ్లను తారురోడ్లుగా మార్చేందుకు అటు ప్రజా ప్రతినిధులు, ఇటు అధికారులు చొరవ చూపకపోవడంతో బాధిత గ్రామాల ప్రజలకు నేటికీ రోడ్ల కష్టాలు తీరడం లేదు. మండలంలోని కొర్లవలస-పనసలవలస, కె.వెంకటాపురం-ఖండ్యాం, అక్కన్నఅగ్రహారం-లక్ష్మీపురం, లచ్చారాయపురం-గుళ్ళపాడు, గుళ్లపాడు-ఉంగరాడ, ఖండ్యాం-సోమరాజుపేట, అంబఖండి-గుళ్లసీతారాంపురం, కాగితాపల్లి-బూరాడ గ్రామాల రోడ్లలో ఏ చిన్నపాటి వర్షం పడినా రోడ్లన్నీ చిత్తడిచిత్తడి అవుతాయి. ఆ సమయంలో ఆయా రోడ్ల మీదుగా వెళ్లాలంటే ప్రమాదాలు కొని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని గ్రామస్తులు అంటున్నారు.

**సంతకవిటిలో రహదారు(ణా)లు..**

మండలంలోని మొత్తం 34 పంచాయతీలు ఉండగా, పానుగుటివలస-తలతంపర, మందరాడ-గోవిందపురం, మిర్తివలస-మండాకురిటి, మల్లయ్యపేట-శేషాద్రిపురం, మద్దూరుపేట-కృష్ణంవలస, కొండగూడేం, గరికిపాడు-సోమన్నపేట, పుల్లిట-ఎస్.రంగారాయపురం గ్రామాల రహదారులు దారుణంగా తయారయ్యాయి. శిథిలమైన రోడ్లు, గుంతలతో నిండిన ఆయా రోడ్లలో ప్రయాణమంటే వెనకడుగు వేయాల్సిన పరిస్థితి అని ఏర్పడిందని గ్రామస్తులు వాపోతున్నారు.

**రోడ్డు పనులు ఆపేశారు..**

గత ప్రభుత్వ హయాంలో పీఐయూ నిధులతో గడిముడిదాం నుంచి సీఎస్ఆర్ పురానికి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. అప్పట్లో రోడ్డును చదును చేసి, గ్రావెల్ కూడా వేశారు. ఇంతలో ఎన్నికలు రావడం ప్రభుత్వం మారడంతో ఆ రోడ్డు పనులు అలానే ఆపేశారు. ఇలా చాలా గ్రామాల అనుసంధాన రోడ్లు అధ్వానంగా ఉన్నాయి.

–లావేటి సులోచన, ఎంపీపీ, రాజాం

**ఇప్పటికైనా రోడ్డు వేయండి..**



గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలోనే గ్రామీణ సడక్ యోజన ద్వారా మా గ్రామానికి బీటీ రోడ్డు.. మందరాడ నుంచి మంజూరైంది. ఇంతవరకు ఆ రోడ్డు నిర్మాణం జరగలేదు. ఇప్పుడు మళ్లీ అదే టీడీపీ.. కేంద్రంలోనూ టీడీపీ మిత్రపక్షమైన బీజేపీ రెండూ అధికారంలో ఉన్నాయి. ఇప్పటికైనా రోడ్డు వేయండి. ప్రజల సుఖవంతమైన ప్రయాణానికి సహకరించండి.

– రాగోలు రమేష్‌నాయుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు, గోవిందపురం

**ప్రతిపాదనలు పంపించాం..**



మండల పరిషత్ సర్వసభ్య సమావేశాల్లో ఈ రోడ్లకు బీటీ నిర్మాణాల నిమిత్తం ఆయా గ్రామాల ప్రజల ద్వారా ప్రజాప్రతినిధులు తీర్మానాలు చేస్తున్నారు. పీఐయూ విభాగం ద్వారా ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన రోడ్లకు ప్రతిపాదలు పంపించాం. తీర్మానాలు కూడా జరిగాయి. నిధులు రాగానే అన్నిచోట్ల కాకపోయినా కొన్నిచోట్ల అయినా రోడ్లు నిర్మిస్తాం.

-వి.శ్రీనివాసరావు, ఎంపీడీవో, రాజాం

**వంగరలో మట్టిరోడ్లే గతి..**

వంగర మండలంలోని మారుమూల గ్రామాలకు రోడ్డు సదుపాయం లేక పోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని దశాబ్దాలుగా ఉన్న మట్టిరోడ్లపైనే నడిచివెళ్లాల్సిన పరిస్థితి. ఇవే రోడ్లలో వర్షాకాలంలో అయితే ప్రయాణం నరకం. ఎన్నికల సమయంలో నాయకులు గ్రామాలకు రావడం, రోడ్డు వేయిస్తామని హామీ ఇవ్వడం ఆ తర్వాత ఆ మాటను మర్చిపోవడం జరిగిపోతోంది. మండలంలోని చంద్రంపేట-జనార్ధనవలస జంక్షన్, ఇరువాడ-చౌదరివలస, మరువాడ-సీతాదేవిపురం, కొప్పరవలస జంక్షన్-రుషింగి, కొట్టిశ-కె.కొత్తవలస, మద్దివలస-తలగాం, బాగెంపేట రోడ్లు ప్రస్తుతం ధ్వంసమై ప్రమాదకరంగా మారాయి. పాలకులు మారినా తమ రోడ్లు బాగుపడడం లేదని బాధిత గ్రామాల ప్రజలు వాపోతున్నారు.



కాగితాపల్లి-బూరాడ గ్రామాల అడ్డురోడ్డు ఇలా..



మల్లయ్యపేట-హొంజరాం రూట్‌లో మట్టిరోడ్డు దుస్థితి

### శిథిల వంతెనల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్...

రాజాం: నియోజకవర్గంలోని పలుచోట్ల సాగునీటి కాలువలపై శిథిలావస్థలోని వంతెనలను ఆర్అండ్‌బీ అధికారులు పరిశీలించారు. వంతెనలు బాగాలేని కారణంగా ఈ నెల 21వ తేదీన 'శిథిలావస్థలో.. వంతెనలు' శీర్షికన సాక్షి దినపత్రికలో వార్తాకథనం ప్రచురితమైంది. ఈ మేరకు స్పందించిన ఆర్అండ్‌బీ శాఖ.. అధికారులను క్షేత్రస్థాయికి పంపించి వంతెన దుస్థితిని పరిశీలింపజేసింది. వార్తా కథనంలో పేర్కొన్న వంతెనలతో పాటు మరికొన్ని చోట్ల ఉన్న వంతెనలను కూడా తమ బృందం నిశితంగా పరిశీలించిందని ఆ శాఖ డీఈఈ కేవీ ప్రసాద్ శనివారం తెలిపారు. సంతకవిటి మండలంలోని వాసుదేవపట్నం వద్ద నారాయణపురం, సాయన్నచానల్‌పై ఉన్న రెండు వంతెనల దగ్గర కొత్తవి నిర్మించేందుకు ప్రతిపాదనలు పెట్టామని, నిధులు రాగానే పనులు చేయిస్తామన్నారు. అలాగే రాజాం మండలంలోని అంతకాపల్లి వద్ద ఉన్న సారథిగెడ్డపై వంతెన మరమ్మతులు త్వరలోనే చేస్తామన్నారు. రేగిడి మండలంలోని ఏకేఎల్ గెడ్డపై ఉన్న వంతెనను బాగు చేసేందుకు ఎన్‌డీబీ నిధులకు ప్రతిపాదనలు పెట్టామన్నారు. మిగిలిన వంతెనలు తమ పరిధిలో లేవన్నారు.

### వేడుకగా పంచాంగ శ్రవణం

రాజాం సిటీ/వంగర/బాడంగి/బొబ్బిలి: మండలాల్లోని పలు గ్రామాల్లో పంచాంగ శ్రవణం శనివారం వేడుకగా నిర్వహించారు. ఉగాది పర్వదినం పురస్కరించుకుని, విశ్వావసు నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పురోహితులు చదివి వినిపించిన పంచాంగాన్ని అందరూ శ్రద్ధగా విన్నారు. రాశుల ఫలితాలు, ఆదాయ, వ్యయాలు, అవమానం, రాజ్యపూజ్యం, లాభనష్టాలు, పాడిపంటలు తదితర వాటి గూర్చి అడిగి తెలుసుకున్నారు.

### నిషేధిత పాలిథిన్ సంచులు వాడొద్దు

రాజాం: నిషేధిత పాలిథిన్ సంచులు వాడవద్దని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ సూచించారు. స్థానిక పట్టణంలోని పూల మార్కెట్‌తో పాటు పలు టిఫిన్ షాపులు, కిరాణా దుకాణాల్లో ఆయన శనివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కొంతమంది వ్యాపారులు వినియోగిస్తున్న నిషేధిత పాలిథిన్ సంచులు స్వాధీనం చేసుకుని, హెచ్చరించారు. నిషేధిత ప్లాస్టిక్, పాలిథిన్ సంచుల వాడకానికి దూరంగా ఉండాలని తెలిపారు. పట్టుబడిన వారే మళ్లీ పట్టుబడితే కఠిన చర్యలుంటాయన్నారు

### • ఆక్రమణదారులు శిక్షార్హులు



తెర్లాం మండలం, సుందరాడ గ్రామ శ్మశానవాటిక స్థలాన్ని ఆక్రమించిన వారు శిక్షార్హులని హెచ్చరిస్తూ రెవెన్యూ శాఖ అధికారులు బ్యానరు ఏర్పాటు చేశారు. శ్మశానవాటికను కొంతమంది ఆక్రమించుకుంటున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో దర్యాప్తు చేయాలని తహసీల్దారు జి.హేమంత్‌కుమార్ ఆదేశించగా, శనివారం క్షేత్రస్థాయికి వెళ్లిన సిబ్బంది ఆక్రమణలపై ఆరాతీశారు. సర్వే నంబరు 122లోని శ్మశానవాటిక విస్తీర్ణం 6.76 ఎకరాలు అని ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు తెలిపారు.

- తెర్లాం

### • భోజనం బాగులేదు సార్..

బొబ్బిలిలోని పాతకోట వద్ద ఉన్న ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను ఎమ్మెల్యే బేబీనాయన శనివారం సందర్శించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలపై ఉపాధ్యాయులను ఆరాతీశారు. మధ్యాహ్నం విద్యార్థులకు భోజనాలు వడ్డిస్తూ వంటకాలు ఏ విధంగా ఉంటున్నాయని ఆయన అడగ్గా, భోజనం బాగుండడం లేదు సార్.. అని విద్యార్థులు వాపోయారు. విద్యార్థులు భోజనం తినే ప్లేట్లు కూడా సరిగా లేకపోవడంతో వాటిని కొనుగోలు చేసి ఇస్తానని ఆయన హామీ ఇచ్చారు. వంటకాలు రుచి, శుచిగా ఉండేలా చూడాలని నిర్వాహకులకు ఆయన సూచించారు.

- బొబ్బిలి



### • రాత్రికి రాత్రి నరికేసి పట్టుకుపోయారు..

బొబ్బిలి మండలం, కాశిందొరవలస పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు 13లో మెట్టగుడ్డగోర్జిలోని తొమ్మిది టేకు చెట్లను అక్రమంగా నరికివేశారు. శుక్రవారం రాత్రి ఎవరూ లేని సమయంలో చెట్లన్నీ కొట్టేసి పట్టుకుపోయారు. ఈ విషయం తెలుసుకున్న వీఆర్‌వో సుధ.. ఘటన స్థలానికి శనివారం వెళ్లి దర్యాప్తు చేశారు. అక్రమార్కులు నరికి తరలించేసిన చెట్లన్నీ ప్రభుత్వ భూమిలోనివేనని నిర్ధారించినట్లు తహసీల్దారు ఎం.శ్రీను తెలిపారు. చెట్లు దొంగతనానికి పాల్పడిన వారిపై నిఘా ఉంచామని త్వరలోనే గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

- బొబ్బిలిరూరల్



## ప్రజాసంక్షేమానికి సభ్యులు గళం విప్పాలి



సమావేశంలో ప్రజాసమస్యలపై గళమెత్తుతున్న కౌన్సిలర్లు

- మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు


బొబ్బిలి: ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి ప్రతి సభ్యుడూ గళం విప్పాలని మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంతో పాటు రెండు అత్యవసర సమావేశాలు శనివారం జరిగాయి. ఆయన మాట్లాడుతూ గత సమావేశాల్లో సభ్యులు తీసుకువచ్చిన పలు ప్రజా సమస్యలు పరిష్కరించడం జరిగిందని, కొన్ని సమస్యలు అనివార్య కారణాల వల్ల పరిష్కారం కాకపోవచ్చు కానీ అవి కూడా భవిష్యత్‌లో పరిష్కారమయ్యేలా చూస్తామన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో అసెస్‌మెంట్లు డబల్ ఎంటరైన విషయం వాస్తవమేనని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఈ సమస్యను మంత్రి లేదా ఎమ్మెల్యేల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాల్సి ఉందని కౌన్సిలర్ బోడిగంజి రమేష్‌నాయుడు అన్నారు. తాండ్రపాపారాయుడి విగ్రహం వద్ద సుందరీకరణ, ఫౌంటేన్ ఏర్పాటును గతంలో గాంధీ విగ్రహం వద్ద చేద్దామనుకున్నాం కానీ అప్పట్లో ఎన్నికల నోటిఫికేషన్ కారణంగా జరగలేదని, ఇప్పుడు కోడ్ ముగిసిందని ఆ పనులు చేద్దామని మున్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళీకృష్ణ సలహా ఇచ్చారు. తాగునీటి పన్నుల్లో డబల్ అసెస్‌మెంట్లు ఎందుకు వచ్చాయని కౌన్సిలర్ రాంబార్కి శరత్ అధికారులను ప్రశ్నించారు. సాంకేతిక తప్పిదం వల్ల అలా జరిగిందని మున్సిపల్ అధికారులు సమాధానమిచ్చారు. గతంలో వాయిదా పడిన అంశాలతో పాటు కొత్త అజెండాలోని అంశాలను కౌన్సిల్ సభ్యులంతా ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, డీఈ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు



డాక్టర్ తలే రాజేష్

రాజాం: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్.. ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఇదే విషయమై ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీవిశ్వావసు నామ సంవత్సరంలో ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. షడ్రుచుల పండగను ప్రశాంత వాతావరణంలో చేసుకోవాలని కోరారు.



మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ కొత్త తెలుగు సంవత్సరం అందరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు అందివ్వాలని, ప్రతిఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. అలాగే ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చేలా అధికార పార్టీ నాయకులకు సత్బుద్ధి ప్రసాదించాలని భగవంతుడిని కోరారు.

### సంక్షిప్తంగా...

**పరామర్శ**



ఎంపీటీసీ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ బెల్లాన, డాక్టర్ రాజేష్

రేగిడి: మండలంలోని ఉంగరాడ ఎంపీటీసీ సభ్యురాలు పిల్లా రోజా కుటుంబాన్ని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్‌లు శనివారం పరామర్శించారు. ఎంపీటీసీ మామయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న సదరు నేతలు ఆ గ్రామానికి వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టి.అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వి.జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

**సారా నియంత్రణకు పాటుపడాలి**

వంగర/రేగిడి: గ్రామీణ ప్రాంతాల్లో సారా నియంత్రణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని రాజాం ఎక్సైజ్ సీఐ ఆర్.జైభీమ్ కోరారు. వంగర, రేగిడి మండలాల్లోని కోదులగుమ్మడ, సంగాం, మీసాలడోలపేట గ్రామాల్లో సారా నియంత్రణపై శనివారం అవగాహన కల్పించారు. ఎక్కడైనా సారా విక్రయాలు జరిగితే టోల్‌ఫ్రీ నంబర్ 14405కు సమాచారం అందివ్వాలన్నారు.

**ఉద్యోగాలకు 372 మంది ఎంపిక**

బొబ్బిలి: స్థానిక రాజా కాలేజీలో శనివారం జరిగిన జాబ్‌మేళాలో వివిధ ఉద్యోగాలకు 372 మంది ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. జాబ్‌మేళాను ఎమ్మెల్యే బేబీనాయన ప్రారంభించగా, మొత్తం 1312 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు.

**పండగ రోజుల్లోనూ బిల్లులు చెల్లించవచ్చు**


బొబ్బిలి: ఉగాది, రంజాన్ పండగ రోజుల్లోనూ విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని ఈపీడీసీఎల్ ఈఈ ఆవాల అనంతరావు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. స్థానిక ఎలక్ట్రికల్ కార్యాలయం, వేణుగోపాలస్వామి ఆలయం దగ్గరున్న బంకు వద్ద బిల్లులు వసూలు చేస్తున్నామన్నారు.

**గ్రావెల్ ట్రాక్టరు పట్టివేత**

బొబ్బిలిరూరల్: మండలంలోని అలజంగి గ్రామం దగ్గరలోని చెరువులో నుంచి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న ఓ ట్రాక్టరును రెవెన్యూ అధికారులు శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. అనుమతి లేనిదే ఇసుక గానీ, గ్రావెల్ గానీ తరలించరాదని ఆర్ఐ రామకుమార్ ట్రాక్టరు యజమానికి సూచించారు.

## ప్రజాసమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత మీపై లేదా?


- మండల సమావేశంలో అధికారుల తీరుపై సభ్యుల ధ్వజం



అధికారులను ప్రశ్నిస్తున్న ఎంపీపీ సన్యాసినాయుడు

మెంటాడ: ప్రజాసమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై లేదా అని పలువురు సభ్యులు అధికారులను నిలదీశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యల పరిష్కారంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఎంపీపీ మండిపడ్డారు. ఎండలు ఎక్కువగా ఉన్నా ఉపాధి హామీ పనులకు వెళ్లే వేతనదారులకు కనీసం ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా పంపిణీ చేయడం లేదని ఇద్దనవలస సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాయిపిల్లి రామారావు ధ్వజమెత్తారు. అలాగే ఆస్పత్రి అభివృద్ధి నిధులు ఏ మేర ఖర్చు చేశారో చెప్పడం లేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దోమల నివారణకు చర్యలు కనిపించడం లేదన్నారు. కరెంట్ సమస్యలపై సిబ్బందికి ఫోన్ చేస్తే భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని వారు ఫోన్ చేసిన వారిని బెదిరిస్తున్నారని వైస్ ఎంపీపీ సారికి ఈశ్వరరావు ఎలక్ట్రికల్ ఏఈఈ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామాల్లో పూర్తిస్థాయిలో తాగునీరు ఉండడం లేదని పలువురు సభ్యులు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నవీన్‌ను నిలదీశారు. మెంటాడ నుంచి ఆండ్ర వరకు రోడ్డుకు ఇరువైపులా ప్రమాదకరంగా ఉన్న చెట్ల తొలగింపు చేపట్టకపోవడంపై ఎంపీపీ ఆ శాఖ అధికారులను ప్రశ్నించారు. సమావేశానికి హాజరుకాని అధికారులకు మెమోలు జారీ చేయాలని ఎంపీడీవో భానుమూర్తికి ఎంపీపీ సూచించారు. వైస్ ఎంపీపీ దుర్గ, తహసీల్దారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



చట్టాల గూర్చి వివరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శారదాంబ

సంతకవిటి: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండడం అవసరమని సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ అన్నారు. మండలంలోని గుళ్లసీతారాంపురంలో ఉన్న సీతారాముల ఆలయం వద్ద న్యాయవిజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించి, ప్రజలకు వివిధ చట్టాలపై చైతన్యం చేశారు. ముఖ్యంగా పోక్సో చట్టం గూర్చి విద్యార్థులు, పిల్లల తల్లిదండ్రులు అవగాహన పెంచుకోవాలన్నారు. 18 ఏళ్లలోపు బాలికలపై లైంగికదాడులకు పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మహిళలు, యువతులు, బాలికలంతా తమకు రక్షణ కల్పించే చట్టాలపై పూర్తి అవగాహన పొందాలన్నారు. అలాంటప్పుడే ఏదైనా సమస్యపై ధైర్యంగా పోరాడగలరన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి కె.నైమిష, ఎస్ఐ ఆర్.గోపాలరావు, ఎంపీడీవో కె.సురేష్‌కుమార్, బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధిపులకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ హెచ్చరించారు. స్థానిక కోర్టు ఆవరణలో సిబ్బందితో శనివారం సమావేశమైన ఆమె.. పని ప్రదేశంలో అందరూ సోదరభావంతో మెలగాలని, అసభ్య పదజాలంతో ఎవరినీ దూషించరాదన్నారు. బాధిత మహిళ ఫిర్యాదు చేయలేని పరిస్థితుల్లో బాధితురాలి అనుమతితో లీగల్ హెయిర్ గానీ బంధువులు గానీ, స్నేహితులు గానీ ఫిర్యాదు చేయవచ్చన్నారు.